
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు
వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జి.మాడుగుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శశికాంత్ సూచించారు.
8లో



రైవాడకు వరద తాకిడి
అనకాపల్లి: భారీ వర్షాల ధాటికి జిల్లాలోని రైవాడ జలాశయం నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. 113.40 మీటర్లకు చేరుకుంది.



కార్తీక దామోదర మాసోత్సవాలు
విశాఖ: ఇస్కాన్‌లో కార్తీక దామోదర మాసోత్సవాల సందర్భంగా రాధాకృష్ణులు, సుభద్ర జగన్నాథస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

న్యూస్‌రీల్

డీఎఫ్‌వోగా సందీప్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



మోదకొండమ్మతల్లిని దర్శించుకుంటున్న డీఎఫ్‌వో వెంకట సందీప్‌రెడ్డి

సాక్షి, పాడేరు: పాడేరు డివిజనల్ అటవీ శాఖాధికారిగా పి. వెంకట సందీప్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా స్థానిక మోదకొండమ్మతల్లిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఐఎఫ్ఎస్ బ్యాచ్ 2019కు చెందిన ఆయన వైఎస్సార్ జిల్లా కడప డీఎఫ్‌వోగా పనిచేసేవారు. సాధారణ బదిలీల్లో భాగంగా ప్రభుత్వం ఆయనను పాడేరు డీఎఫ్‌వోగా నియమించింది. ఇంతవరకు పాడేరు డీఎఫ్‌వోగా పనిచేసిన వినోద్‌కుమార్ పుట్టపర్తి డీఎఫ్‌వోగా బదిలీ అయ్యారు.

మందుగుండు దుకాణాలకు అనుమతి తప్పనిసరి

రంపచోడవరం: దీపావళి పండగ పురస్కరించుకుని మందుగుండు సామాన్లు అమ్మేందుకు ఏర్పాటు చేసే దుకాణాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ సూచించారు. ఈ నెల 25లోగా రెవెన్యూ డివిజన్ పరిధి ఏడు మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో అనుమతుల కోసం దరఖాస్తులు అందజేయాలని కోరారు. అనుమతులు పొందిన దుకాణదారులు మాత్రమే సంబంధిత తహసీల్దార్ నిర్ణయించిన ప్రదేశాల్లో దుకాణం ఏర్పాటుచేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి సంబంధించి అతిథి అధ్యాపకులను నియమిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డి. రవికుమార్ తెలిపారు. మ్యాథ్స్, జువాలజీ, ఎకనామిక్స్ అధ్యాపక పోస్టులకు సంబంధించి అర్హులైన అభ్యర్థులు ఈ నెల 26లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీజీవో 55శాతం మార్కులతో పాటు పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత కలిగిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. వీరికి ఈనెల 28న ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా నియమిస్తామని ఆయన పేర్కొన్నారు.

నర్సుల అసోసియేషన్ ఎన్నికలు రేపు



ఎన్నికల అధికారి శ్రీనివాస్

మహారాణిపేట (విశాఖ): ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సుల అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా యూనిట్ ఎన్నికలు బుధవారం నిర్వహించనున్నట్టు ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి. శ్రీనివాస్ సోమవారం తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేజీహెచ్‌లోని యూనియన్ బ్యాంకు సమీపంలోని నర్సుల క్లాక్ రూమ్‌లో సీక్రెట్ బ్యాలెట్ విధానంలో ఎన్నికలు జరుగుతాయన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రతిఒక్క ఓటరు తప్పకుండా గుర్తింపు కార్డుతో పాటు ఒరిజినల్ ఆధార్ కార్డు లేక ఏదైనా ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. పోటీ చేసే అభ్యర్థులు పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ప్రచార బ్యానర్లు, ఫ్లెక్సీలు, టెంట్లు ఏర్పాటు చేయకూడదని స్పష్టం చేశారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ పరిధిలో మెగా డీఎస్సీకి సిద్ధమవుతున్న యువతకు సాంఘిక, గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత ఇచ్చే శిక్షణ ఇస్తున్నట్లు పీవో కట్టా సింహాచలం తెలిపారు. వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెలిపారు. బీ.ఈడీ, డీఎడ్ అర్హతతో టెట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ శిక్షణ పొందేందుకు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ.2.50లక్షల లోపు ఉండాలని సూచించారు. దరఖాస్తులను జ్ఞానభూమి పోర్టల్‌లో ఈ నెల 25 లోగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. దరఖాస్తు చేసుకునేందుకు ఇబ్బందులు ఉంటే రంపచోడవరం వైటీసీ మేనేజర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 7569098197 నంబరులో సంప్రదించాలని పీవో సూచించారు.

లోయర్ సీలేరు కాంప్లెక్సులోని పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద ఉత్పత్తి ప్రాజెక్ట్‌గా నిలవనుంది. 460 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్ట్‌లో ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నిర్మిస్తున్న 5,6 యూనిట్లు అందుబాటులోకి వస్తే ఉత్పత్తి సామర్థ్యం 690 మెగావాట్లకు చేరుతుంది. వచ్చే ఏడాది మే నాటికి **పనులు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని జెన్‌కో అధికారవర్గాలు చెబుతున్నాయి.**

పొల్లూరు ▸ సూపర్ పవర్

690 మెగావాట్లకు పెరగనున్న విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం

- శరవేగంగా 5,6 యూనిట్ల నిర్మాణ పనులు
- రూ.536 కోట్లు వెచ్చించిన గత ప్రభుత్వం
- 40 శాతం మేర సివిల్ పనులు పూర్తి
- వచ్చే మే నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం

మోతుగూడెం: పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో ఐదు,ఆరు యూనిట్ల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వచ్చే ఏడాది మే నాటికి ఎలాగైనా పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఏపీ జెన్‌కో అధికారులు ఉన్నారు. ఇప్పటివరకు ఈ ప్రాజెక్ట్‌లో 115 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల నాలుగు యూనిట్లు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటుచేస్తున్న మరో రెండు 115 మెగావాట్ల యూనిట్లతో ఉత్పత్తి సామర్థ్యం 690 మెగా వాట్లకు చేరనుంది.




ప్లాస్టింగ్, పెయింటింగ్ అనంతరం పెన్ స్టాక్ పైపులైన్ గొట్టాలు

విద్యుత్ కొరతతో..

రాష్ట్ర విభజన తరువాత డిమాండ్‌కు తగినంత విద్యుత్ ఉత్పత్తి లేకపోవడంతో అధిక ధరలకు ప్రైవేటు సంస్థల నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో గత రాష్ట్ర ప్రభుత్వం పొల్లూరులో 5, 6 యూనిట్ల నిర్మాణంపై దృష్టి సారించింది. రూ.536 కోట్లతో చేపట్టే ఈ పనులకు సంబంధించి రెండేళ్ల క్రితమే టెండర్ల ప్రక్రియ పూర్తి అయినప్పటికీ కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖల నుంచి అనుమతులు రాలేదు. రాష్ట్ర అధికారులు కేంద్ర ప్రభుత్వంతో పలుమార్లు చర్చలు జరిపిన అనంతరం పర్యావరణ అనుమతులు మంజూరు చేస్తూ ఉత్వర్వులు వెలువడటంతో గతేడాది నుంచి పనులు మొదలయ్యాయి.

- ఐదు, ఆరు యూనిట్లకు సంబంధించి బాటం ఫ్లోర్ నుంచి కాంక్రీట్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరోపక్క పెన్‌స్టాక్ పైప్ లైను పనులు కూడా ప్రారంభం అయ్యాయి.
- మిడిల్ యాంకర్ నుంచి వాల్వ్ హౌజ్ వరకు సంబంధించి పైపులు అమర్చేందుకు కాంక్రీట్ పనులను సివిల్ ఇంజినీరింగ్ అధికారులు వేగవంతం చేశారు. వీటిని బీహెచ్ఈఎల్ నుంచి ఇంజినీర్ల బృందం పర్యవేక్షిస్తోంది. కీలకమైన సివిల్ పనులు 40 శాతం పూర్తయ్యాయి.



5,6 యూనిట్లు నిర్మించే ప్రదేశంలో చురుగ్గా జరుగుతున్న కాంక్రీట్ పనులు

ఆదిలోనే ఆరు యూనిట్లకు గ్రౌండ్ వర్క్..

సీలేరు నదిపై చింతూరు మండలం పొల్లూరు వద్ద 1976వ సంవత్సరంలో జలవిద్యుత్ కేంద్రం నిర్మాణం చేపట్టారు. మొత్తం ఆరు యూనిట్ల నిర్మాణానికి గ్రౌండ్ లెవెల్, స్ట్రక్చర్ వంటి సివిల్ పనులు చేశారు. తొలుత ఒక్కొక్కటి 115 మెగావాట్ల సామర్థ్యంతో నాలుగు యూనిట్లను నిర్మించారు. 1977లో అందుబాటులోకి వచ్చింది. మొత్తం ఆరు యూనిట్ల నిర్మాణానికి గ్రౌండ్ లెవెల్, స్ట్రక్చర్ వంటి సివిల్ పనులు అప్పటిలో పూర్తి చేశారు.



స్పైరల్ కేసింగ్ పైపులకు వెల్డింగ్ పనులు

వెల్డింగ్ చేసిన పైపులను తీసుకుని వెళ్లేందుకు ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారు. వెల్డింగ్ చేసిన పెన్‌స్టాక్ పైపులకు శాండ్ ప్లాస్టింగ్‌తో పాటు పెయింటింగ్ పనులు పూర్తి చేశారు.

- బాటం ఫ్లోర్ నుంచి అండర్ గ్రౌండ్ టన్నెల్‌కు



మిడిల్ యాంకర్ నుంచి పెన్‌స్టాక్ పైపు లైన్లు నిర్మించే ప్రాంతం

పూర్తిస్థాయి ఉత్పత్తి దిశగా..

ఈ ఏడాది సీలేరు విద్యుత్ కాంప్లెక్సు పరిధిలో జలాశయాలు పూర్తిస్థాయి నీటిమట్టాలకు చేరుకున్నాయి. దీంతో జెన్‌కో అధికారులు డొంకరాయి, మోతుగూడెం జలవిద్యుత్ కేంద్రాల్లో పూర్తిస్థాయి ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రతికూల పరిస్థితుల్లో..

ప్రతికూల పరిస్థితుల్లోనూ పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం లక్ష్యానికి తగ్గట్టుగా ఉత్పత్తి సాధించింది. 2021–22లో 929.489 మిలియన్ యూనిట్లు, 2022–23లో 1078.54 మిలియన్ యూనిట్లు, 2023–24లో 1003.599 మిలియన్ యూనిట్లు మేర విద్యుత్‌ను ఉత్పత్తి చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏపీ జెన్‌కో 1035 మిలియన్ యూనిట్లు లక్ష్యం విధించగా ఈనెల 11 వరకు 596.675 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి సాధించింది. మరో ఐదు నెలల గడువు ఉన్నందున లక్ష్యానికి మించి ఉత్పత్తి చేసే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు అంచనా వేస్తున్నారు.

లక్ష్యానికి తగ్గట్టుగా పనులు



ఐదు, ఆరు యూనిట్లు ఏర్పాటుకు సంబంధించి పెన్‌స్టాక్ పనులతో పాటు సివిల్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అందుకు అనుగుణంగా విధించిన లక్ష్యానికి అనుగుణంగా సిబ్బంది పనిచేస్తున్నారు. బీహెచ్ఎల్ ఇంజినీరింగ్ బృందం ఇప్పటికే ప్రాజెక్ట్‌కు వచ్చింది. వచ్చే ఏడాది మే నాటికి రెండు యూనిట్లు అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నాం.

–జి.వాసుదేవరావు, చీఫ్ ఇంజినీర్, లోయర్ సీలేరు విద్యుత్ కాంప్లెక్సు

విహారయాత్రలో విషాదం

- సోకులేరు వాగులో పడి యువకుడి గల్లంతు
- రెండు రోజుల తరువాత మృతదేహం లభ్యం
- స్నానం చేస్తుండగా ప్రమాదం
- మృతుడు ఏలూరు జిల్లా వాసి



రవితేజ (ఫైల్)

మోతుగూడెం : చింతూరు మండలం సోకులేరు వాగు వద్ద స్నానం చేస్తుండగా ఓ యువకుడు ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందాడు. దీంతో విహారయాత్ర కాస్త విషాదంగా మారింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చేబ్రోలు నుంచి కరణం రవితేజ (26) పది మంది స్నేహితులతో కలిసి ఈ నెల 18న విహార యాత్రకు బయలుదేరారు. దీనిలో భాగంగా అదేరోజు మండలంలోని సోకులేరు వ్యూపాయింట్‌కు వచ్చారు. అక్కడ స్నేహితులతో కలిసి వాగులో దిగాడు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తూ జారిపడి గల్లంతయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లారు. అప్పటినుంచి రవితేజ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈనేపథ్యంలో సోమవారం మృతదేహం లభ్యమైందని స్థానిక పోలీసులు తెలిపారు. సోకులేరు వ్యూపాయింట్‌కు సుమారు కిలోమీటరు దూరంలో గుర్తించామని ఎస్ఐ శివన్నారాయణ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతదేహాన్ని చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని ఆయన వెల్లడించారు. విహారయాత్రకు వచ్చిన వారంతా ఈవెంట్ డెకరేషన్ కార్మికులుగా పనిచేస్తున్నారు.

పంచాయతీరాజ్‌లో అడ్డగోలు బదిలీలపై విచారణ

- విచారణ అధికారిగా జెడ్పీ సీఈవోను నియమించిన కలెక్టర్
- ఉమ్మడి విశాఖ జిల్లా అధికారుల నుంచి వివరాల సేకరణ

సాక్షి ఎఫెక్ట్..

మహారాణిపేట (విశాఖ): పంచాయతీరాజ్ కార్యనిర్వహణాధికారి అండ్ రూరల్ డెవలప్‌మెంటు (ఈవోపీఆర్ అండ్ ఆర్‌డీ) బదిలీలపై ఎట్టకేలకు విచారణ చేపట్టారు. గత నెల 28,29న తేదీల్లో అడ్డగోలు బదిలీలపై సాక్షిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. బదిలీల ప్రక్రియలో డబ్బులు చేతులు మారడంతో అధికారులు విచారణ ప్రారంభించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న అనేక మంది ఈవోపీఆర్ అండ్ ఆర్‌డీలు మైదాన ప్రాంతానికి రాలేకపోవడం, ప్రతి బదిలీకి డబ్బులు డిమాండ్ చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. దీంతో పాటు గత నెల 22న బదిలీలు చేయగా, వాటిని 30వ తేది వరకు రహస్యంగా ఉంచడంపై కూడా విమర్శలు వచ్చాయి. దీనిపై కూడా విచారణ చేస్తున్నారు. బదిలీల ప్రక్రయలో నిబంధనలు పాటించలేదని కలెక్టర్ హరేందిర ప్రసాద్ కూడా పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నారాయణమూర్తిని విచారణ అధికారిగా కలెక్టర్ నియమించారు. సోమవారం జెడ్పీ సీఈవో నారాయణమూర్తి విచారణ చేపట్టారు. అనకాపల్లి జిల్లా, అల్లూరి జిల్లా అధికారుల నుంచి కూడా వివరాలు సేకరిస్తున్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తలారిసింగి క్రీడామైదానంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించింది. పోలీసు అమరవీరుల సంస్మరణ స్థూపం వద్ద కలెక్టర్, ఎస్పీ అమిత్‌బర్దర్ పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. అమరవీరుల త్యాగాలను గౌరవిస్తూ సెల్యూట్ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రజలంతా గౌరవిస్తున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా పోలీసుశాఖ పనిచేస్తుందన్నారు. ఈ ప్రాంతంలో కూడా విధి నిర్వహణలో అమరులైన పోలీసులు ఉన్నారని, వారి త్యాగాలను ప్రతి పోలీసు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఎస్పీ అమిత్‌బర్దర్ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల కుటుంబాలకు అన్ని విధాలా సహాయం చేస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో పోలీసుశాఖ గిరిజనుల సంక్షేమానికి కృషి చేయడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా పనిచేస్తున్నాయన్నారు. అనంతరం పోలీసు అమరవీరుల కుటుంబాలకు ఆర్థిక సాయం చెక్కులను కలెక్టర్, ఎస్పీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పి.వేణుగోపాల్, అడిషనల్ ఏఎస్పీ(ఏఆర్) సత్యరాజ్, సీఐలు జగబంధు, హిమగిరి, ఎస్ఐలు పాల్గొన్నారు.



అమరవీరుల కుటుంబాలకు ఆర్థికసాయం అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్

ఆర్టీసీలో అప్రెంటిస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్(విశాఖ): ఏపీఎస్‌ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. విశాఖ జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, పెయింటర్, అనకాపల్లి జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, విజయనగరం జిల్లాకు సంబంధించి మెషినిస్ట్, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, వెల్డర్, కాకినాడ జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, వెల్డర్, తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్ ట్రేడ్స్‌లో ఖాళీలు ఉన్నాయి. ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులు www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలి. అభ్యర్థులు ఆయా తేదీల్లో ఉదయం 10 గంటలకు విజయనగరంలోని వీటీ అగ్రహారం గల జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ హాజరుకావాలి.

సర్టిఫికెట్ల పరిశీలన తేదీలు

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల అభ్యర్థులకు నవంబర్ 6న, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం జిల్లాకు చెందిన అభ్యర్థులు నవంబర్ 7న, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల అభ్యర్థులు నవంబర్ 8న హాజరుకావాలి. ఒక జిల్లాలో సంబంధిత ట్రేడ్‌లో ఖాళీలు లేనిచో వేరే జిల్లాలో పనిచేసేందుకు అంగీకార పత్రం సర్టిఫికెషన్ సమయంలో రాసి ఇవ్వాలి. మరిన్ని వివరాలకు 08922-294906 నంబర్‌లో సంప్రదించవచ్చు.

ప్రజా సమస్యలపై 57 అర్జీల స్వీకరణ

సబ్ కలెక్టర్ అధ్యక్షతన పరిష్కార వేదిక

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 57 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. చింతలపూడి పంచాయతీలోని వలస నుంచి కోట గ్రామం వరకు నాలుగు కిలోమీటర్లు తారు రోడ్డు నిర్మించాలని, కన్నేరు వాగుపై వంతెన పనులు పూర్తి చేయాలని ఎంపీపీ ఆనంద్, జెడ్పీటసీ కర్ర వెంకటలక్ష్మి, సర్పంచ్ పల్లాల సన్యాసమ్మ వినతి పత్రం అందజేశారు.

- పందిరిమామిడి, కోట గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కరించాలని, వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేయాలని సర్పంచ్ ఈతపల్లి రాజేశ్వరి అర్జీ అందజేశారు.
- కాకవాడ నుంచి వేములకొండ వరకు తారు రోడ్డు నిర్మించాలని, వేములకొండ లోని అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మించాలని ఆయా ప్రాంతాలకు చెందిన పలువురు వినతి పత్రాలు అందజేశారు.
- వేములకొండ– కొత్తవీధి గ్రామ వరకు సీసీ రోడ్డు నిర్మించాలని, విద్యుత్ సమస్య పరిష్కారించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ జాన్‌రాజ్, డీడీ విజయశాంతి, డీఈవో వై.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

సాంకేతిక విజ్ఞానంతో విద్యాబోధన

కళాశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ శోభారాణి

సాక్షి,పాడేరు: సాంకేతిక పరమైన విజ్ఞానంతో విద్యార్థులకు బోధించాలని కళాశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శోభారాణి ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సోమవారం ఆమె సందర్శించారు. వచ్చేనెల 7,8 తేదీలలో నాక్ బృందం డిగ్రీ కళాశాలను సందర్శించనున్న నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న కళాశాల అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆర్ట్స్, సైన్స్,లైబ్రరీ కంప్యూటర్ విభాగాలను తనిఖీ చేశారు. కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన జెడ్ స్పేస్ ల్యాబ్‌ను ఆమె ప్రారంభించారు. అధ్యాపకులతో నిర్వహించిన సమావేశంలో నాణ్యమైన ఉన్నత విద్యాబోధనకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టిబ్బాయి, అధ్యాపకులు ఆమెను సత్కరించి, మోదకొండమ్మ అమ్మవారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు.



జెడ్ స్పేస్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న శోభారాణి

విమ్స్‌లో రొమ్ము క్యాన్సర్‌పై ఉచిత వైద్య శిబిరం నేడు

ఆరిలోవ(విశాఖ): విమ్స్‌లో మంగళవారం రొమ్ము క్యాన్సర్‌పై ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తెలిపారు. అంకాలజీ వైద్యులు మహిళలకు రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా జరుపుతారన్నారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరం ఓపీ బ్లాక్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని తెలిపారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ముగ్గురి ఎంపిక

అరకులోయ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్ తెలిపారు. ఇటీవల గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగిన జూనియర్ సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో కళాశాలకు చెందిన శెట్టి లోహిత్ 200 మీటర్లు 2.47 సెకెండ్లు, 400 మీటర్లు 51.78 సెకెన్లలో పరుగెత్తి బంగారు పతకం సాధించినట్టు తెలిపారు. అదేవిధంగా మరో విద్యార్థి పవన్‌కుమార్ 4 ×100 మీటర్ల పరుగు పందెంలో 42.23 సెకెండ్లలో పరుగెత్తి బ్రాంజ్ పతకం పొందాడన్నారు. వీరితోపాటు గోపాలకృష్ణ లాంగ్ జంప్‌లో 6.81 మీటర్లు దూకి బంగారు పతకం పొందాడని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. వీరు ఈనెల 25 నుంచి 29 వరకు ఒడిశాలోని భువనేశ్వర్ కళింగ స్టేడియంలో జరిగే జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు స్పోర్ట్స్' ఇన్‌చార్జి పసుపులేటి నాగబాబు, ఎన్ఎస్ఎస్ పీవోలు వై. విజయలక్ష్మి మోష్యా అనితకుమారి, పీడీ సమర్థి అప్పారావు, అధ్యాపకులు అభినందించారు.



అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్, కోచ్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి



పాడేరు పరిసరాల్లో కురుస్తున్న పొగమంచు



పాడేరులో కురుస్తున్న వర్షం

మన్యంలో భిన్న వాతావరణం

- మంచు.. ఎండ..వర్షం
- తగ్గుముఖం పడుతున్న ఉష్ణోగ్రతలు
- 18 నుంచి 19 డిగ్రీల మధ్య నమోదు
- సందర్శకులకు వింత అనుభూతి

సాక్షి,పాడేరు/పెదబయలు: ఏజెన్సీల్లో కొద్దిరోజులుగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. గత మూడు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. పాడేరు, అరకు, చింతపల్లి ప్రాంతాల్లో 18 నుంచి 19 డిగ్రీల మధ్య కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సోమవారం మినుములూరు కేంద్ర కాఫీ బోర్డు వద్ద 18 డిగ్రీలు నమోదైనట్టు అధికారవర్గాలు తెలిపాయి. ఉదయం వేళల్లో మంచు దట్టంగా కురుస్తోంది. ఆ తరువాత వాతావరణం కాస్త వేడెక్కింది. మధ్యాహ్నం నుంచి పాడేరు, చింతపల్లి, జి.మాడుగుల, హుకుంపేట, పాడేరు ఘాట్ ప్రాంతాల్లో వర్షం కురుస్తూనే ఉంది. పెదబయలులో ఉదయం మంచు దట్టంగా కురవగా మధ్యాహ్నం రెండు గంటల వరకు భానుడు ప్రతాపం చూపాడు. ఆ తరువాత భారీ వర్షం కురిసింది. వారపు సంతలో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంలో వీధులు జలమయం అయ్యాయి. ఏజెన్సీ ప్రాంతానికి వచ్చే సందర్శకులు వింత అనుభూతి పొందుతున్నారు.

క్లుప్తంగా

సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు

జి.మాడుగుల: వాతావరణ మార్పుల నేపథ్యంలో సంభవించే వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శశికాంత్ తెలిపారు. స్థానిక ఏకలవ్య పాఠశాలలో సోమవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి ఆరోగ్య పరమైన సమస్య తలెత్తినా వెంటనే వైద్య సిబ్బంది, పీహెచ్‌సీలో సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ శిబిరంలో 140 మంది విద్యార్థులకు సికిల్‌సెల్ ఎనీ పరీక్షలు నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న 12 మందికి మలేరియా పరీక్షలు నిర్వహించారు.వ్యాధుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని విద్యార్థులకు వైద్యాధికారి సూచించారు. వైద్య సిబ్బంది దేవుడమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

హత్యకేసులో ఐదుగురి అరెస్టు


మాట్లాడుతున్న సీఐ వెంకటరావు

ముంచంగిపుట్టు: మండలంలోని జర్జుల పంచాయితీ సంతవీధి గ్రామానికి చెందిన వంతినిభ బాబూరావు(49) వ్యక్తిపై దాడి చేయడం, ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతూ మృతి చెందిన సంఘటనలో ఐదుగురిని అరెస్టు చేసినట్టు జి.మాడుగుల సీఐ సీహెచ్.వెంకటరావు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో సమావేశం నిర్వహించి, వివరాలను వెల్లడించారు. ఈ నెల17న సంతవీధి గ్రామంలో బాబూరావుకు కొంతమందితో గొడవ జరిగిందని, దీంతో వారు దాడి చేయడంతో బాబూరావు గాయాలైనట్టు తెలిపారు. ఆయన ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో వైద్య సేవలు పొంది, మెరుగైన వైద్యం కోసం పాడేరు జిల్లా ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ ఈ నెల 19న మృతి చెందినట్టు బాబూరావు భార్య చీమలమ్మ ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. ఈ మేరకు విచారణ అనంతరం సంతవీధి గ్రామానికి చెందిన ముద్దాయిలు కిల్లో నరేంద్ర, కిల్లో నరసింహమూర్తి, కిల్లో బుద్దు, కిల్లో సోన్ను, కిల్లో నారాయణలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు సీఐ వెంకటరావు తెలిపారు. ఎస్ఐ కె.రవీంద్ర ఉన్నారు.

ఎస్‌బీఐ గోల్డ్ బాండ్ పథకానికి అప్పన్న బంగారం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి భక్తులు హుండీల్లో సమర్పించిన 4.380 కిలోల కచ్చా బంగారాన్ని సోమవారం దేవస్థానం అధికారులు నగరంలోని ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచ్‌కి తరలించారు. బంగారాన్ని శుద్ధి చేశాక, స్వచ్ఛమైన బంగారం ఎంత వస్తుందో ఆ మేరకు ఎస్‌బీఐ గోల్డ్‌బాండ్‌స్కీమ్ సర్టిఫికెట్‌ను దేవస్థానానికి అందిస్తారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, దేవదాయశాఖ రాజమహేంద్రవరం ఆర్‌జేసీ సుబ్బారావు, జ్యూవెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ పల్లమరాజు, సింహాచలం దేవస్థానం డిప్యూటీ ఈవో రాధ, ఏఈవోలు తదితరుల సమక్షంలో బంగారాన్ని ఎస్‌బీఐ మేనేజర్ నరసింగరావుకి అందించారు.

అమరుల త్యాగాలు మరువలేనివి


జి.మాడుగులలో పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ


మోతుగూడెం అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు


చింతూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

జి.మాడుగుల: జిల్లా వ్యాప్తంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా పలువురు సీఐలు, ఎస్ఐలు మాట్లాడుతూ విద్యార్థులకు పోలీసు సేవల ఔన్నత్యాన్ని వివరించారు. శాంతి భద్రతల పరిరక్షణ విధుల నిర్వహణలో అశువులు బాసిన పోలీసుల జ్ఞాపకార్థం అమరువీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తారని చెప్పారు. త్యాగాలను వివరించారు. మావోయిస్టుల దాడిలో అమరులైన పోలీసుల గురించి తెలియజేశారు.అమరుల త్యాగాలు మరువలేనివన్నారు. జి.మాడుగులలో జరిగిన కార్యక్రమంలో సీఐ వెంకటరావు, ఎస్ఐ షణ్ముఖరావు పోలీసు అమరులకు ఘనంగా నివాళులర్పించారు.

సీలేరు: సీలేరులో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ జె.రామకృష్ణ, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, పలు పాఠశాలల విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి అమరులైన పోలీసులకు నివాళులర్పించారు. స్థానిక పోలీసు స్టేషన్ నుంచి హనుమాన్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, మార్కెట్ సెంటర్ వద్ద విద్యార్థులతో మానవహారం ఏర్పాటుచేశారు. ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ బలిమెలలో జరిగిన కూంబింగ్ సంఘటన గురించి విద్యార్థులకు తెలియజేశారు.


సీలేరులో మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణ


రంపచోడవరంలో పోలీసుల ర్యాలీ

రంపచోడవరం: రంపచోడవరంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ స్టేషన్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.వివిధ కళాశాలల విద్యార్థులు, పోలీసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలు ఎప్పటి మరిచిపోలేనివన్నారు.

చింతూరు: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని సోమవారం చింతూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం స్థానిక పాఠశాల విద్యార్థులకు పోలీసు సేవల ఔన్నత్యాన్ని ఎస్ఐ రమేష్ వివరించారు. పోలీసు సిబ్బందితో పాటు సీఆర్‌పీఎఫ్, గ్రేహౌండ్ సిబ్బంది పాల్గొన్నారు.

మోతుగూడెం: పోలీసు అమరుల దినోత్సవంలో ఎస్ఐలు శివకుమార్, కె.శివనారాయణ, ఏపీ జెన్‌సీఈ వాసుదేవరావు, డీఈ బాలకృష్ణ, మోతుగూడెం సర్పంచ్ సీత, పోలీస్ స్టేషన్ సిబ్బంది ,సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్‌పీ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక పోలీసు స్టేషన్ నుంచి పోలీస్ అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థూపం వద్ద పోలీసు అమరవీరులకు అంజలి ఘటించి నివాళులర్పించారు.

గందరగోళంగా పీసా గ్రామసభ


ఎటపాకలో గ్రామసభ నిర్వహిస్తున్న తహసీల్దార్ సుబ్బారావు

ఎటపాక: మద్యం దుకాణం ఏర్పాటు కోసం ఎటపాక పంచాయతీలో సోమవారం నిర్వహించిన పీసా గ్రామసభ గందరగోళంగా మారింది. ముందుగా సర్పంచ్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేశారు. అయితే సభ నిర్వహణ పీసా చట్టానికి విరుద్ధంగా ఉందని ఐటీడీఏ, రెవెన్యూ అధికారులు ఎవరూ లేకుండా సరిపడ సభ్యుల కోరం లేకుండా గ్రామసభ నిర్వహణ సరికాదని ప్రజాప్రతినిధులు, గిరిజనులు అడ్డుకున్నారు. దీంతో గ్రామసభ వాయిదా వేస్తున్నట్టు పంచాయతీ అధికారులు తీర్మాణం చేసి పత్రాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు సుస్మిత, ఎంపీపీ కామేశ్వరి, సభ్యులకు అందజేశారు.దీంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే కొంత సమయం తరువాత తహసీల్దార్ సుబ్బారావు అక్కడికి చేరుకుని సభ్యులు, గ్రామస్తులు సభలోనే ఉన్న కారణంగా యథావిధిగా గ్రామసభ జరిపించాలని నిర్ణయించారు. డీపీవో ఆదేశాల మేరకు సభ జరిపించామని అందరి ఆమోదంతో మద్యం దుకాణం ఏర్పాటుకు తీర్మానించినట్లు తహసీల్దార్ తెలిపారు.

గ్రామసభ వాయిదా

అడ్డతీగల: మద్య దుకాణాల ఏర్పాటు కోసం సోమవారం స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభ కోరం లేక వాయిదా పడింది. సర్పంచ్ పప్పుల చిట్టమ్మ, ఉప సర్పంచ్ ముప్పనశెట్టి శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి వీరేంద్ర హాజరయ్యారు. గ్రామంలో 14 వార్డులకు గాను కనీసం ఐదురుగు సభ్యులు కూడా సభకు హాజరుకాలేదు. అడ్డతీగలలోని రెండు మద్యం దుకాణాలకు ఈనెల 14న టెండర్‌లు ఖరారు కాగా వాటి ఏర్పాటుకు షెడ్యూల్డ్ ప్రాంత నియమాల ప్రకారం పీసా గ్రామసభ నిర్వహించాల్సి ఉంది.

అయితే సభకు సంబంధించి ప్రచారం చేయకపోవడంతో పూర్తిస్థాయిలో సభ్యులు రాక, రెవెన్యూ, ఐటీడీఏ అధికారులు హాజరుకాలేదని పలువురు చెప్పారు. కోరం లేకపోవడంతో మరోసారి సభ నిర్వహించాలని అధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకున్నారు.

వేధింపుల ఫిర్యాదుపై డీసీహెచ్ విచారణ


చింతపల్లి ఏరియా ఆస్పత్రి


విచారణ చేస్తున్న డీసీహెచ్ కృష్ణారావు

చింతపల్లి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ జి.ప్రభావతి తమను వేధిస్తున్నట్టు సిబ్బంది రాజారావు, లక్ష్మి చేసిన ఫిర్యాదుపై డీసీహెచ్ కృష్ణారావు సోమవారం విచారణ చేశారు. సూపరింటెండెంట్ వేధిస్తున్నారంటూ స్పందనలో కలెక్టర్ దినేష్‌కుమార్‌కు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం విచారణ చేపట్టిన డీసీహెచ్ ఇరువురు సిబ్బంది ఇచ్చిన వాంగ్మూలాన్ని తీసుకున్నారు. ఆఫీసు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రాజారావు మాట్లాడుతూ తాను ఆరోగ్య సమస్యల కారణంగా సర్జరీ చేయించుకున్నా సరెండర్ కావాలని సూపరింటెండెంట్ ప్రభావతి వేధిస్తున్నట్టు వాంగ్మూలంలో పేర్కొన్నారు. ఆస్పత్రిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మి మాట్లాడుతూ ఆస్పత్రికి సంబంధించి రూ.29 వేలతో వస్తువులు కొనుగోలు చేసినట్టు నిబంధనలకు వ్యతిరేకంగా ఓచర్ లేకుండా తెల్లకాగితంపై బిల్లు చేయాలని ఒత్తిడి తీసుకొచ్చారని, తాను వ్యతిరేకించడంతో తనకు కుర్చీ, టేబుల్ కూడా లేకుండా చేశారని, నేలపై కూర్చొని కంప్యూటర్‌తో పనిచేస్తున్నానని వాంగ్మూలంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీసీహెచ్ కృష్ణారావు మాట్లాడుతూ ఇరువురి నుంచి తీసుకున్న వాంగ్మూలాన్ని కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

28న అగ్రిగోల్డ్ బాధితుల సదస్సు

అనకాపల్లి: అగ్రిగోల్డ్ సంస్థలో పెట్టుబడులు పెట్టి మోసపోయిన బాధితులకు పదేళ్లుగా న్యాయం జరగలేదని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కరణం మాణిక్యాలరావు, గౌరవాధ్యక్షుడు వై.ఎస్.భద్రం అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. అగ్రిగోల్డ్ సంస్థ విలువైన ఆస్తులను విక్రయించి, వచ్చిన సొమ్మును బాధితులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28న విజయవాడలో అగ్రిగోల్డ్ బాధితుల సదస్సు జరగనున్నట్టు తెలిపారు. దుర్గారావు, శేషు, గోపాల రమణ, లక్ష్మణ, సూరిబాబు, చిన అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

300 కిలోల గంజాయి పట్టివేత

నలుగురు అరెస్టు


చింతపల్లిలో పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు


పెదబయలులో పట్టుబడిన గంజాయి, నిందితులతో సీఐ వెంకటరావు, ఎస్ఐ రమణ

పెదబయలు: మండలంలోని సీతగుంట పంచాయతీ సీతగుంట జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా సోమవారం ఉదయం 150 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు జి.మాడుగుల సీఐ సీహెచ్.వెంకటరావు, ఎస్ఐ రమణ తెలిపారు. ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి ముంచంగిపుట్టు మండలం కుజభంగి జంక్షన్ నుంచి పెదబయలు మీదుగా మైదాన ప్రాంతానికి జీపులో ఆరు బస్తాల్లో తరలిస్తున్న గంజాయిని తరలిస్తున్న ముంచంగిపుట్టు మండలం బాబుశాల పంచాయతీ కాండ్రంగి వలస గ్రామానికి చెందిన వంతాల జయరాం, అదే గ్రామానికి చెందిన సిరగం కిరణ్‌కుమార్‌లను అదుపులో తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. వాహనాన్ని సీజ్ చేశామన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి: ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి తరలిస్తున్న 150 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు చింతపల్లి సీఐ రమేష్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన సోమవారం వివరాలు వెల్లడించారు. మండలంలోని బలపం పంచాయతీ సుర్తపల్లి నుంచి గంజాయిని తరలించేందుకు సిద్ధం చేసినట్టు అందిన సమాచారంతో అన్నవరం పోలీసు సిబ్బంది తనిఖీ చేపట్టారన్నారు. ఈ తనిఖీల్లో 150 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. గంజాయిని తరలిస్తున్న మామిడి మోహన్‌రావు, మామిడి నాగేశ్వరావులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

తుపాను హెచ్చరికలతో జీవీఎంసీ అప్రమత్తం

డాబాగార్డెన్స్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బుధవారం నాటికి తుపానుగా మారే అవకాశం ఉన్నందున, పరిస్థితుల్ని ఎదుర్కొనేందుకు జీవీఎంసీ యంత్రాంగం సన్నద్ధంగా ఉందని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ తెలిపారు. నగరంలోని కొండవాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ జీవీఎంసీ యంత్రాంగాన్ని టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించినట్లు తెలిపారు. తుపాను ప్రభావం వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా పునరావాస కేంద్రాలు సిద్ధం చేసినట్లు కమిషనర్ వెల్లడించారు. తుపాను ఇబ్బందులు, సహాయం కోసం జీవీఎంసీ టోల్ ఫ్రీ 1800 4250 0009 నంబర్ ద్వారా సంప్రదించవచ్చన్నారు.

సంపద సృష్టికి మ్యూచువల్ ఫండ్స్ మంచి మార్గం

- మ్యూచువల్ ఫండ్స్‌లో పారదర్శకత, భద్రత ఎక్కువ
- రిటర్న్స్, విత్‌డ్రా ఎంతో సులభం
- ఎప్పుడైనా పెట్టుబడిని తిరిగి పొందొచ్చు
- ప్రతి నెలా పెన్షన్ రూపంలో నగదు పొందవచ్చు
- ఏఎంఎఫ్ఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట నాగేశ్వర్



ఏయూ క్యాంపస్ : మన కోసం మనం సంపదను సృష్టించుకోవాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం మ్యూచువల్ ఫండ్స్ ఒక మంచి మార్గమని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (ఏఎంఎఫ్ఐ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట నాగేశ్వర్ చలసాని చెప్పారు. ఆయన సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మ్యూచువల్ ఫండ్స్‌లో పారదర్శకత ఎక్కువని, భద్రత ఎక్కువని, రిటర్న్స్, విత్‌డ్రా ఎంతో సులభమని వివరించారు. మ్యూచువల్ ఫండ్ సంస్థల్లో నిపుణులు లోతుగా అధ్యయనం చేసి మంచి సంస్థల్లో పెట్టుబడి పెడతారన్నారు. అవసరమైనప్పుడు మన పెట్టుబడిని తిరిగి పొందొచ్చని తెలిపారు. మ్యూచువల్ ఫండ్స్‌లో దాదాపు 15 శాతం వరకు రాబడి సాధిస్తున్నారన్నారు. పదవీ విరమణ ప్లాన్‌లు సైతం దీనిలో ఉన్నాయని వివరించారు. ప్రతి నెలా పెన్షన్ రూపంలో నగదు పొందవచ్చని అన్నారు. ఏఎంఎఫ్ఐ ఆంధ్రప్రదేశ్ సహా మూడు రాష్ట్రాలను దత్తత తీసుకుందని చెప్పారు. మిడ్, స్మాల్ కాప్‌లో లాభాలు ఆశాజనకంగా ఉన్నాయని, వీటిలో పెట్టుబడులు పెరిగాయని వివరించారు.

ఆర్థిక అక్షరాస్యత పెంచుతున్నాం

ప్రజల్లో ఆర్థిక అక్షరాసత్య పెంచడమే లక్ష్యంగా తమ సంస్థ పలు కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. దేశంలో అక్షరాస్యుల సంఖ్య 70 శాతానికి పైగా ఉండగా, ఆర్థిక అక్షరాస్యత 21 – 22 శాతం మాత్రమే ఉందన్నారు. ఆర్థిక అక్షరాస్యతను పెంచడం ద్వారా ప్రజల్లో పెట్టుబడులపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. మన దేశంలో 44 శాతం వరకు పెట్టుబడులు రియల్ ఎస్టేట్ రంగంలో, 22 శాతం బంగారంపై ఉన్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా మ్యూచువల్ ఫండ్స్‌లో 65 శాతం పెట్టుబడులు ఉండగా భారత్‌లో మాత్రం 19.7 శాతం మాత్రమే ఉన్నాయని, వీటిని మరింత పెంచుతున్నామని చెప్పారు. ఈ ఫండ్స్‌లో రూ.500 నుంచి పెట్టుబడి పెట్టొచ్చని, త్వరలో దీనిని రూ.250కి తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా 5 కోట్ల మంది ఈ రంగంలో పెట్టుబడి పెడుతున్నారని, 21 కోట్ల ఫోలియోలు ఉన్నాయని, ప్రస్తుతం రూ. 67.09 లక్షల కోట్ల పెట్టుబడులు ఉన్నాయన్నారు.

మొదటి స్థానంలో ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్

ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్ ఇండియాలో మొదటి స్థానంలో నిలుస్తోందన్నారు. దేశవ్యాప్తంగా 44 అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థలు పనిచేస్తున్నాయని, వీటిపై సెబీ పర్యవేక్షణ ఉంటుందన్నారు. సెబీకి, అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థలకు మధ్య అనుసంధానంగా ఏఎంఎఫ్ఐ పనిచేస్తోందన్నారు. మ్యూచువల్ ఫండ్ సంస్థలన్నీ కలిసి ఈ అసోసియేషన్‌ను ప్రారంభించాయన్నారు. సెబీ నియమావళిని ఎప్పటికప్పుడు తమతో పంచుకుంటుందని, తమ నుంచి సూచనలు కూడా స్వీకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ మార్కెటింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ మమత ముదిలియార్ వైద్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో రూ.89 వేల కోట్ల పెట్టుబడులు

ఆంధ్రప్రదేశ్‌లో రూ.89 వేల కోట్లు మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టారని నాగేశ్వర్ చెప్పారు. వీటిలో రూ.65 వేల కోట్లు ఈక్విటీలో, రూ.15 వేల కోట్లు ఫిక్స్‌డ్ ఇన్‌కం విభాగంలో, మిగిలినవి బ్యాలెన్స్‌డ్‌గా ఉన్నాయని తెలిపారు.

బాల కార్మికులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్


మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట : జిల్లాలో బాల కార్మికులను గుర్తించేందుకు నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులను, కార్మికశాఖ అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ కార్మిక శాఖకు అన్ని విభాగాల అధికారులు పూర్తి తోడ్పాటు అందించాలని సూచించారు. నెల రోజుల పాటు జిల్లా పరిధిలోని అన్ని కంపెనీలు, వ్యాపార సంస్థలు, దుకాణాలు, ఫ్యాక్టరీలు, ఇతర పరిశ్రమలను తనిఖీ చేయాలని, అక్కడ పని చేసేవారి వివరాలను సేకరించాలని చెప్పారు. ఎన్‌సీపీసీఆర్ మార్గ దర్శకాలకు అనుగుణంగా 14 ఏళ్ల లోపు వాళ్లు ఎక్కడా కూడా పనిచేయడానికి వీలు లేదన్నారు. 15 నుంచి 18 ఏళ్ల వయసు గల వారు ప్రమాదకర కంపెనీల్లో పనిచేయడానికి వీలు లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మోహన్ కుమార్, కార్మిక శాఖ ఉప కమిషనర్ సునీత, డీఈవో చంద్రకళ, బీసీ వెల్ఫేర్ అధికారిణి శ్రీదేవి, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఐసీడీఎస్, పోలీసు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజేతలకు బహుమతుల అందజేత


విజేతలతో కలెక్టర్ హరేందిర ప్రసాద్, డీఈవో చంద్రకళ, ఇతర అధికారులు

మహారాణిపేట: జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, డిబేటింగ్ పోటీల్లో విజేతలకు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ బహుమతులు అందజేశారు. గత నెల 30న పోటీలు నిర్వహించారు. విజేతలైన 63 మంది విద్యార్థులకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయి విజేతలకు కలెక్టర్ సోమవారం సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. వ్యాసరచన పోటీలో ప్రథమ స్థానం పొందిన కె. విరాజిత (జిల్లా పరిషత్ హైస్కూలు, చింతల అగ్రహారం), ద్వితీయ స్థానం ఎల్.జ్యోత్స్నా (కేజీబీవీ.ఆనందపురం), తృతీయ స్థానం ఎం.సిద్ర సుల్తానా (ప్రభుత్వ క్వీన్ మేరీ హైస్కూలు, పాత పోస్టాఫీసు), డిబేట్ పోటీల్లో ప్రథమ స్థానంలో కె.సుహాసిని గీతిక, కె.వర్షిణి (జిల్లా పరిషత్ హైస్కూలు, నడుపూరు), ద్వితీయ స్థానంలో పి.సుస్మిత ప్రియాంక, జేవీఎస్ ప్రీతి, (జిల్లా పరిషత్ హైస్కూలు, చిట్టివలస), తృతీయ స్థానంలో జె.భేవ్ సారీ, ఎస్.అక్షయ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (సునీల్ శర్మకాలనీ), వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానం ఆర్.భరద్వాజ్ (జీవీఎంసీ ఉన్నత పాఠశాల, ప్రకాశరావుపేట), ద్వితీయ స్థానంలో పి.అచ్చుతరావు (పెద నరవ), తృతీయ స్థానం కె.సుహాసిని గీతిక (జిల్లా పరిషత్ హైస్కూలు నడుపూరు) తదితరులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు.

బైక్ కొనలేదని విద్యార్థి ఆత్మహత్య

పుట్టిన రోజు నాడు విషాదం


పేరిశెట్టి గణేష్ (ఫైల్)

పీఎంపాలెం: పుట్టిన రోజు నాడు విషాద సంఘటన చోటుచేసుకుంది. తండ్రి బైక్ కొనలేదని కోపంతో ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చాడు. ప్రాణస్నేహితులను దుఃఖ సాగరంలో ముంచెత్తాడు. పీఎంపాలెం గాయత్రీనగర్ జేఎస్ఎన్ యూఆర్ఎం కాలనీలో సోమవారం జరిగిన సంఘటనకు సంబంధించిన సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు.. పేరిశెట్టి సూర్యనారాయణ విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం కోమటిపల్లి గ్రామం నుంచి సుమారు ఆరేళ్ల క్రితం నగరానికి వలస వచ్చాడు. ప్రస్తుతం ఓ కళాశాలలో హాస్టల్ కుక్‌గా పనిచేస్తూ పీఎంపాలెం గాయత్రీనగర్‌లో భార్య గంగ, పెద్ద కుమారుడు గణేష్ , 9వ తరగతి చదువుతున్న చిన్న కుమారుడు లోకేష్‌తో కలిసి నివసిస్తున్నాడు. పెద్ద కుమారుడు నగరంలోని ఓ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం పుట్టిన రోజు కావడంతో సాయంత్రం కేక్ కట్ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. ఇంతలో ఏమైందో ఏమో ఇంటి తలుపులు వేసుకుని ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనుకోని పరిణామంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు, స్థానికులు వేలాడుతున్న గణేష్‌ను కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బాలకృష్ణ తెలిపారు.

బైక్ కొనమని తండ్రితో గొడవ

విద్యార్థి గణేష్ ఎప్పటి నుంచో బైక్ కొనమని తల్లిదండ్రులను వేడుకుంటున్నాడు. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం. బైక్ కొనే స్థోమత ఆ కుటుంబానికి లేదు. ఇదే విషయం తల్లిదండ్రులు గణేష్ నచ్చచెప్పినప్పటికీ వినేవాడు కాదు. ఈ విషయంపైనే తండ్రితో గొడవ పడినట్టు స్థానికులు చెబుతున్నారు. బైక్ కొనే స్థోమత లేకపోవడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

లారీ ఢీకొని బాలుడి దుర్మరణం


మృతి చెందిన జిలానీ

ఎస్.రాయవరం: లారీ, స్కూటీ ఢీకొన్న ఘటనలో ఓ బాలుడి మృతి చెందాడు. అడ్డురోడ్డు సమీపంలో సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ విభీషణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నక్కపల్లి మండలం పెద బోదిగళం గ్రామానికి చెందిన తాతా మనవళ్ల షేక్ మహ్మద్ ఖాదర్ బాషా, షేక్ అబ్దుల్ ఖాదర్ జిలానీ(16) కలిసి స్కూటీపై అడ్డురోడ్డు వచ్చారు. వారు తిరిగి వెళ్తుండగా అనకాపల్లి నుంచి తుని వైపు వెళ్తున్న లారీ వెనక నుంచి స్కూటీని ఢీకొట్టింది. దీంతో స్కూటీపై వెనక కూర్చున్న జిలానీ తూలి రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. కాలు విరిగిపోయింది. అపస్మారక స్థితిలో ఉన్న జిలానీని ముందుగా నక్కపల్లి సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించే సరికి బాలుడు మృతి చెందాడని పోలీసులు తెలిపారు. జిలాని ఈ నెల 18న పెదబోదిగళం గ్రామంలో జరిగిన గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలకు కాకినాడ నుంచి బోదిగళంలో ఉంటున్న తాతయ్య ఇంటికి వచ్చినట్టు చెప్పారు. ఎదుగొచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో కాకినాడలో ఉంటున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జూనియర్ అసిస్టెంట్ ఆత్మహత్య

భీమునిపట్నం: పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భీమిలికి చెందిన సీల అనంత పద్మనాభరావు(56) గాజువాక తహసీల్దారు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య విశాలాక్షి, కుమార్తె సాయిదేవి ఉన్నారు. అతడు కొంత కాలంగా మానసిక సమస్యలు, అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఆదివారం బీచ్ రోడ్డులోని కొబ్బరి చెట్ల పార్కు వద్ద అతను పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో ఉండడాన్ని పోలీసులు గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం చనిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.